సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 24 । జనవరి । 2025



నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆర్కే బీచ్‌లోని ఆయన విగ్రహం వద్ద విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. జోహార్.. సుభాష్ చంద్రబోస్ అంటూ నినదిస్తూ పువ్వులు చల్లుతూ నేతాజీని స్మరించుకున్నారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



డీసీఐకి ఊపిరి!

అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ హార్బర్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

IIలో

వైజాగ్–దుర్గ్ వందేభారత్

ఇక 8 కోచ్‌లతోనే..



- 4 నెలల క్రితమే రైలు ప్రారంభం
- ప్రతి రోజూ 23 శాతం నిండని సీట్లు
- భారమవడంతో కోచ్‌లను కుదించాలని నిర్ణయం

సాక్షి, విశాఖపట్నం/తాటిచెట్లపాలెం : భారతీయ రైల్వే వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన వందేభారత్ రైళ్లు అన్ని చోట్లా అద్భుతంగా దూసుకుపోతున్నాయి. ఈ రైళ్లకు క్రమంగా డిమాండ్ కూడా పెరుగుతోంది. అయితే విశాఖపట్నం–దుర్గ్–విశాఖపట్నం(20829/20830) వందే భారత్ రైలు మాత్రం ప్రజాదరణకు నోచుకోలేదు. రైలు ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా.. వంద శాతం ఆక్యుపెన్సీ ఒక్క రోజూ దాటలేదు. 16 రేక్‌లతో ప్రారంభమైన ఈ ట్రైన్‌లో సీసీ, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లతో కలిపి 1,286 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కానీ.. ప్రతి రోజూ సీసీ కోచ్‌ల్లో 900 వరకు, ఎగ్జిక్యూటివ్ కోచ్‌ల్లో 70 వరకు సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అంటే 23 శాతం కంటే తక్కువ ఆక్యుపెన్సీతో ఈ రైలు నడుస్తోంది. దీంతో ఈ ట్రైన్ నిర్వహణ బిలాస్‌పూర్ రైల్వే అధికారులకు భారంగా మారింది. ఈ రైలును రద్దు చేయాలన్న డిమాండ్ క్రమంగా తెరపైకి వచ్చింది. అయితే.. ఆ రాష్ట్ర ప్రజాప్రతినిధులు మాత్రం కొనసాగించాలని రైల్వే బోర్డుపై ఒత్తిడి తీసుకురావడంతో సర్వీసు నడపక తప్పడం లేదు. అయితే బిలాస్‌పూర్ రైల్వేపై నిర్వహణ భారం పడకుండా కోచ్‌లు కుదించాలని నిర్ణయించారు. మూడు నెలల క్రితం రైల్వే అధికారులే కోచ్‌లు కుదించి నడపాలని ప్రతిపాదనలు పంపించారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు శుక్రవారం నుంచి 8 కోచ్‌లతో మాత్రమే నడపాలని ఆదేశాలు జారీ చేశారు. ఇకపై దుర్గ్–వైజాగ్ వందేభారత్ 1–ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్, 7–చెయిర్ కార్ కోచ్‌లతో నడుస్తుందని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జోన్ అధికారులతో పాటు వాల్తేరు డివిజన్ అధికారులు ప్రకటించారు.

తిరుపతికి వందేభారత్‌పై పరిశీలన!

దుర్గ్‌కు సర్వీసు నడిపే బదులు.. నిరంతరం ప్రయాణాలు చేసే పుణ్యక్షేత్రం తిరుపతి–విశాఖపట్నం మధ్య వందేభారత్ నడపాలన్న డిమాండ్ ప్రయాణికుల నుంచి నిరంతరం వినిపిస్తోంది. ఈ సర్వీసు నడిపితే కచ్చితంగా ఆక్యుపెన్సీ 100 శాతం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీనిపై వాల్తేరు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్, రైల్వే ప్రయాణికుల సంఘాలు ప్రజాప్రతినిధులకు, రైల్వే అధికారులకు లేఖలు రాయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతికి కొత్త సర్వీసు నడపడంపై రైల్వే ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ సక్రమంగా జరిగితే.. మరికొద్ది నెలల్లోనే విశాఖ నుంచి తిరుపతికి వందేభారత్ దూసుకుపోతుందని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు చెబుతున్నారు.

28 నుంచి 'పాలిటెక్నిక్' స్పోర్ట్స్ మీట్

మురళీనగర్ : రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని సాంకేతిక విద్యాశాఖ కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (ఆర్‌జేడీ) జె.సత్యనారాయణ మూర్తి కోరారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లను స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, కోఆర్డినేటర్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్యతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీల్లో 13 రీజియన్స్ నుంచి 1,612 మంది విద్యార్థులు పాల్గొంటారని, వీరికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అన్ని విభాగాల క్రీడలు నిర్వహణకు అనుకూలంగా క్రీడా మైదానాన్ని సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల శాఖాధిపతులు, స్థానిక పీడీ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.




స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణమూర్తి

చోడవరంలో ఏపీ

ట్యాక్స్

పెందుర్తిలో పీఆర్



- చోడవరంలో టన్నుకు రూ.250 చొప్పున వసూలు
- రోజుకు రూ.10 లక్షలు.. నెలకు రూ.3 కోట్లు వసూలు
- పక్క నియోజకవర్గ నేత ప్రమేయంపై విమర్శలు
- పెందుర్తి దరి నరవలో ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్
- కూటమి నేతకు ట్రిప్పునకు కొంత చొప్పున చెల్లింపు

రోలుగుంట మండలంలో టిప్పర్లలో గ్రావెల్ తరలింపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు ఎక్కడికక్కడ అనుమతిస్తూ... తమ సొంత ట్యాక్స్‌లను వసూలు చేస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఒక్కో ట్రిప్పునకు రూ.22 వేలు చొప్పున కూటమి నేతలు వసూలు చేస్తుండగా.. చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో 'ఏపీ' ట్యాక్స్, 'పీఆర్' ట్యాక్స్ పేరుతో వసూలుకు తెగబడటం చర్చనీయాంశమైంది. చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట మండలంలో అధికార, అనధికార క్వారీల నుంచి తరలివెళ్లే కంకరతోపాటు బండరాళ్లకు ప్రతీ టన్నుకు రూ.250 చొప్పున 'ఏపీ' ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తున్నారు. అయితే పక్కనున్న నియోజకవర్గ నేత పేరుతో టిప్పరు, ట్రాక్టరు యజమానుల నుంచి ఈ ట్యాక్స్ వసూలు చేస్తుండటం గమనార్హం. ఇక పెందుర్తి నియోజకవర్గంలోని నరవ ప్రాంతంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు రాత్రి, పగలనకుండా ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఏకంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ), అటవీశాఖ భూముల్లోనే ఈ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలు చేపడుతున్న వ్యక్తులు... కూటమి నేతకు 'పీఆర్' ట్యాక్స్ చెల్లిస్తున్నారు. దీంతో మైనింగ్ అధికారులు ఎవరూ అటు వైపుగా కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి.

నెలకు రూ.3 కోట్లు వసూలు!

చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో చేపడుతున్న అధికార, అనధికార మైనింగ్ ద్వారా ప్రతీ రోజూ పదుల సంఖ్యలో లారీల నుంచి కంకర తరలివెళుతోంది. ఇక స్థానిక అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా కూడా తరలిస్తున్నారు. గుర్తింపు ఉన్న క్వారీల నుంచి తరలిస్తున్న వాటికి సీనరేజీ కింద ప్రభుత్వం వసూలు చేసే మొత్తానికి అదనంగా టన్నుకు రూ. 250 వసూలు చేస్తున్నారు. పక్క నియోజకవర్గానికి చెందిన కూటమి నేత పేరుతో 'ఏపీ' ట్యాక్స్‌గా అధికారికంగా ఈ మొత్తాన్ని వసూలు చేస్తుండటం గమనార్హం. అంటే ఇక్కడ ప్రతీ రోజూ రూ.10 లక్షలు.. నెలకు రూ.3 కోట్ల మేర వసూలు చేస్తున్నారు. నిబంధనల మేరకు ఒక్కో లారీ నుంచి 20 టన్నుల కంకరను తరలించాల్సి ఉండగా.. 30 టన్నుల వరకు తరలించేస్తున్నారు. తద్వారా ఒక్కో టన్నుకు అదనంగా రూ. 250 చెల్లించి.. అధిక లోడును తీసుకెళ్లేందుకు టిప్పరు యాజమాన్యాలకు కూటమి నేతలు అనుమతిస్తున్నారు. ఇక్కడి నుంచి తరలించే ఏ వాహనాన్ని కూడా అటు మైనింగ్ అధికారులు కానీ.. ఇటు రవాణాశాఖ అధికారులు కానీ ఆపేందుకు సాహసించడం లేదు. అధిక లోడుకు అనధికారికంగా అనుమతి లభిస్తుండటంతో సదరు టిప్పరు యజమానులు కూడా రూ.250 మొత్తాన్ని చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. ట్రాక్టర్ యజమానులు కూడా టన్నుకు రూ.250 చొప్పున చెల్లించి అదనపు లోడును తీసుకెళుతున్నారు. అయితే సదరు టిప్పరు, ట్రాక్టర్ యజమానులు.. ఇంటి నిర్మాణదారులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై భారం మోపుతున్నారు. తద్వారా ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతోందని నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో పాటు డ్రైనేజీ నిర్మాణంలో అదనపు భారాన్ని మోయాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు కూడా గగ్గోలు పెడుతున్నారు.



క్వారీలో టిప్పర్లలో బండ్ల రాళ్లు ఎక్కిస్తున్న పొక్లెయినర్

గుంతలు తవ్వినా...!

పెందుర్తి నియోజకవర్గం నరవ ప్రాంతంలో చెరోవైపు పంచుకొని మరీ కూటమి నేతలు గ్రావెల్ తవ్వకాలను చేపడుతున్నారు. వాస్తవానికి ఈ భూమి ఏపీఐఐసీతో పాటు అటవీశాఖకు చెందినది. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేదని మైనింగ్ అధికారులు కూడా పేర్కొంటున్నారు. దీనిపై గతంలో 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. దీంతో అప్పటి తహసీల్దార్ అక్కడకు వెళ్లి వాహనాలు వెళ్లకుండా అడ్డుగా గుంతలు తవ్వారు. ఇప్పుడు ఆ గుంతలను పూడ్చడంతో పాటు కూటమి నేతలు చెరోవైపు రాత్రి, పగలు తేడా లేకుండా భారీగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ప్రస్తుత తహసీల్దారు అటువైపుగా కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇక మైనింగ్ అధికారుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ఇంత దర్జాగా తవ్వకాలు సాగుతుండటానికి కారణం సదరు వ్యక్తులు.. స్థానిక నియోజకవర్గ కూటమి నేతకు 'పీఆర్' ట్యాక్స్ పేరుతో ట్రిప్పునకు ఇంత మొత్తం చెల్లిస్తుండటమే. మొత్తంగా కూటమి నేతలు ఎక్కడికక్కడ స్థానికంగా ట్యాక్స్ పేరుతో వసూళ్లకు తెగబడుతుండటం చర్చనీయాంశమవుతోంది.



నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

న్యూస్‌రీల్

లోకేష్ పుట్టినరోజు వేడుకల్లో జోనల్ కమిషనర్



పాల్గొన్న జెడ్సీ హేమావతి

గోపాలపట్నం : ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా గోపాలపట్నం ప్రధాన రహదారిలో సుకన్య సినిమా హాల్ ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో జోన్–8 కమిషనర్ హేమావతి పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఇది పార్టీ కార్యక్రమమైనా జోనల్ కమిషనర్ హాజరు కావడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాధికారి పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకూడదనే నియమం ఉన్నా ఆమె పట్టించుకోకపోవడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు హాజరై కేక్ కట్ చేశారు. కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు శిక్షణ

ఆరిలోవ : నిరుద్యోగ మహిళా యువతకు పైనాపిల్‌కాలనీ వద్ద జిల్లా మహిళా ప్రాంగణంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి చేతి వృత్తుల్లో రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నర్సింగ్, రిటైల్‌లో శిక్షణ ఇస్తామన్నారు. నర్సింగ్ శిక్షణకు పదో తరగతి, రిటైల్ శిక్షణకు 8వ తరగతి చదువుకున్న మహిళలు అర్హులని తెలిపారు. 18–36 ఏళ్ల మధ్య వయసు గలవారు ఈ నెల 31తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో రూ.1,000 స్టైఫండ్ ఇస్తామని, మరిన్ని వివరాలు కోసం 6281261415 నంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

కొనసాగుతున్న పింఛన్ల ఏరివేత

నేటి నుంచి రెండో విడత సదరం సర్టిఫికెట్ల తనిఖీ

మహారాణిపేట : కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై కక్ష గట్టింది. ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ పెంచుతామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే కుట్రకు తెరతీసింది. పింఛన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పడుతున్న భారాన్ని తగ్గించుకోడానికి తెలివిగా లబ్ధిదారుల్లో కోత విధించాలని చూస్తోంది. ఇందులో భాగంగా దివ్యాంగులకు మరోసారి పరీక్షలు చేస్తోంది. ఇప్పటికే సామాజిక పింఛన్లు తీసుకొనే వారి మీద ర్యాండమ్‌గా సర్వే చేసిన సంగతి విధితమే. మంచంపై లేవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు నెలకు రూ.15 వేలు పింఛను తీసుకుంటున్నవారి సర్వే గురువారంతో పూర్తయింది. మిగిలిన దివ్యాంగులపై సర్వే ప్రారంభించనున్నారు. శుక్రవారం నుంచి ఆయా పింఛనుదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. అనంతరం వారిని సంబంధిత ఆస్పత్రులకు రప్పించనున్నారు. అలాగే వైద్యుల బృందం దివ్యాంగులకు మళ్లీ పరీక్షలు చేయనున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

మొదటి విడత సర్వే పూర్తి

దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి ఎన్టీఆర్ భరోసా పింఛను పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాల (సదరం) పరిశీలన గురువారంతో పూర్తయింది. మొత్తం 319 మంది ఇళ్లకు వెళ్లి వైద్యులు, అధికారులు విచారణ చేపట్టారు.

రెండో విడత ఏరివేతకు శ్రీకారం

వివిధ కేటగిరీలో పింఛను పొందుతున్న దివ్యాంగుల ఏరివేతకు శుక్రవారం నుంచి శ్రీకారం చుడుతున్నారు. వివిధ కేటగిరీల దివ్యాంగులు రూ.6 వేలు పింఛను పొందుతున్నారు. ఇటువంటివాళ్లు జిల్లాలో మొత్తం 21,306 మంది ఉన్నారు. దివ్యాంగులు (అర్థోపెడిక్)లో 12,238 మంది, కంటి దివ్యాంగులు 2,373 మంది, ఈఎన్టీ దివ్యాంగులు 2,287 మంది, మానసిక దివ్యాంగులు 4,408 మంది ఉన్నారు. వీరికి డీఆర్‌డీఏ జారీ చేసిన నోటీసులను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు అందజేస్తున్నారు.

నేడు జీవీఎంసీలో టౌన్‌ప్లానింగ్ వినతులు స్వీకరణ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో శుక్రవారం టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి వినతులు స్వీకరించనున్నట్టు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ హరేంధిర ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అధికంగా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రతి శుక్రవారం కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు చెప్పారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

త్వరలో 'మన ఆటో మన వైజాగ్'



ఆటోడ్రైవర్లతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖలో 'మన ఆటో మన వైజాగ్' అనే వినూత్న కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో 250 మంది ఆటోడ్రైవర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దాతల సాయంతో ఆటోలపై నగర పర్యాటక ప్రదేశాలైన కైలాసగిరి, ఆర్కే బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, లైట్ హౌస్ కనిపించేలా పెయింటింగ్ వేయించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా యూనిఫాం, ఫొటో ఐడీ కార్డులు అందిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రయాణికుల పట్ల నైతిక ప్రవర్తన, బీమా ఆవశ్యకతను శిక్షణలో బోధించారు. పొదుపు ప్రాముఖ్యత, ఆటో డ్రైవర్లు చేసే సాధారణ ఉల్లంఘనలు, రోడ్డు ప్రమాద క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించే విధానం, ఇటీవల సీసీ ఫుటేజ్‌లో నమోదైన ప్రమాద దృశ్యాలను ప్రదర్శించి, వివరించారు. కార్యక్రమంలో విశాఖ సేఫ్టీ కౌన్సిల్–ట్రైనింగ్, డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ ఇ.బాలసతీష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు, బీమా సలహాదారు సన్నిపాత్రుడు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో విశాఖ అగ్రస్థానం

రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి

విశాఖ సిటీ : ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విశాఖను పర్యాటకంగా అగ్రస్థానంలో నిలబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి పేర్కొన్నారు. విశాఖలో పర్యాటక ప్రాజెక్టులు, ప్రణాళికల రూపకల్పన, మౌలిక వసతుల కల్పన, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై ఆమె జిల్లా అధికారులతో వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సంస్థ పరిధిలో ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న ప్రాజెక్టుల కోసం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కైలాసగిరిపై నేచర్ కాటేజీలు, బీచ్ వ్యూ కేఫ్ వంటి ప్రాజెక్టులకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఫైవ్ స్టార్ మోడల్‌లో ఆధునిక వసతులతో కన్వెన్షన్ సెంటర్, రుషికొండ వద్ద హేబిటేట్ సెంటర్, మధురవాడలో అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్, మెడికల్ టూరిజం కాన్సెప్ట్‌లో భాగంగా అనకాపల్లిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, విజయనగరంలో అధునాతనమైన వసతులు, హంగులతో కూడిన కన్వెన్షన్ సెంటర్, కాపులుప్పాడలో నేచురల్ హిస్టరీ పార్కు, మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాల నిర్వహణ, బహుళ ప్రయోజనాల దృష్ట్యా సుమారు 15 నుంచి 20 ఎకరాల విస్తీర్ణంలో 5 వేల మందికి సరిపడా అతిపెద్ద మల్టీ మోడల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. కొండ ప్రాంతాల్లో ఎకో టూరిజం రిసార్టులు, తాటిపూడి, గంభీరం లాంటి ప్రాంతాల్లో బోట్ క్లబ్‌లు, బహుళ ప్రయోజనాలు, మార్కెటింగ్ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని మెగా అమ్యూజ్మెంట్ పార్కు ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. పోర్టు, అటవీ, జీసీసీ, ఇతర విభాగాల ఆధ్వర్యంలో వివిధ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు ఆయా శాఖల ఉన్నతాధికారులు ఎండీకి వివరించారు. జీసీసీ ఎండీ కల్పనాకుమారి మాట్లాడుతూ అరకు కాఫీకి మరింత గుర్తింపు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని, అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ జూలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని, విదేశాల్లో మాదిరిగా ఆధునిక హంగులు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారిణి జ్ఞానవేణి, డీపీఎం జగదీష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.







సాగరతీరం.. పచ్చతోరణం

విశాల విశాఖ సాగర తీరం పచ్చతోరణంతో సరికొత్త శోభను సంతరించుకుంది. లుంబినీ పార్కు నుంచి భీమిలి మధ్య పరుచుకున్న పచ్చదనం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. ఒకవైపు సాగర సోయగాలు నయనానందాన్ని అందిస్తుంటే.. మరోవైపు ఇరువైపులా పచ్చదనంతో నిండిన రోడ్డుపై ప్రయాణం అనిర్వచనీయమైన అనుభూతి పంచుతోంది.

నేషనల్ స్కూల్స్ చెస్‌లో
రన్నరప్‌గా నైనా



విశాఖ స్పోర్ట్స్ : నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో విశాఖ క్రీడాకారిణి జి.నైనా సత్తా చాటింది. అండర్ 15 బాలికల విభాగంలో నైనా పోటీపడింది. 1,772 రేటింగ్‌తో ఎరినా ఫిడే మాస్టర్‌గా ఏడో ర్యాంక్‌తో తలపడిన నైనా తొమ్మిది రౌండ్ల పోటీలో ఏడు పాయింట్లు సాధించి రెండో ర్యాంక్‌తో ముగించింది. నాలుగో రౌండ్‌లో వుమెన్ ఫిడే మాస్టర్ ఆధ్యాగుప్త(ఢిల్లీ)తో డ్రాగా ముగించగా...ఆరో రౌండ్‌లో తోటి ఎరినా ఫిడే మాస్టర్ ప్రదీక్ష (తమిళనాడు)పై అటాకింగ్‌తో విజయం సాధించింది. ఎనిమిదో రౌండ్‌లో ఎరినా ఇంటర్నేషనల్ మాస్టర్ దీపిక (తమిళనాడు) చేతిలో పరాజయం పాలైంది. మూడోరౌండ్‌లో ఏపీకే చెందిన అస్మితను డిఫెండ్ చేసుకుంటూ విజయం సాధించింది. 28 రాష్ట్రాలకు చెందిన చిన్నారులు అండర్ 7నుంచి అండర్ 17 వరకు 12 వ్యక్తిగత అంశాల్లో పోటీపడ్డారు. ఈ సందర్భంగా చెస్ సంఘం ప్రతినిధులు నైనాను అభినందించారు.

'మనిషన్నాక కాస్త కళాపోషణ ఉండాలి'..పనిచేసే రంగం ఏదైనా మనసుకు దగ్గరైన రంగం ఒకటుంటుంది. అందులో రాణిస్తే ఆ మజా వేరు.. రికార్డులు సృష్టిస్తే ఆ కిక్కే వేరు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు రైల్వే ఉద్యోగులు. తమ కళలతో కలలు సాకారం చేసుకుంటున్నారు. ముగ్గురూ ముగ్గురే అన్నట్టు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న మళ్ల శివ, కేఆర్ జగన్నాథ్, మోకా విజయకుమార్ కళలకు జీవం పోస్తున్నారు.

– తాటిచెట్లపాలెం

కళల రూపం

జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందుతున్న వాల్తేర్ డివిజన్ ఉద్యోగులు

ఆర్ట్ బై శివ



మళ్ల శివ..వాల్తేర్ డివిజన్‌లో లోకో పైలట్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా రైలును నడుపుతూ పచ్చని వాతావరణాన్ని ఆస్వాదించే అలవాటు శివది. విధులు ముగించుకుని వచ్చిన తరువాత చూసిన ప్రకృతి అందాలను కాన్వాస్‌పై ఆవిష్కరిస్తారు. ఇలా అనేక అందమైన దృశ్యాలకు తన కాన్వాస్ ద్వారా రూపం ఇచ్చారు. ఈ విధంగా తాను వేసిన అందమైన చిత్రాలతో కోనసీమ చిత్ర కళా పరిషత్ ఆర్ట్ మ్యాగజైన్ (2025) సంచిక జనవరి 20న విడుదలైంది. ఇంతకు ముందు కూడా శివ రూపొందించిన మినియేచర్ చెస్ బోర్డు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఐదు లక్షల పెన్ డాట్స్‌తో తయారు చేసిన మదర్ థెరెసా చిత్రానికి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.



శివ గీసిన చిత్రం

మిల్లెట్స్..'విజయకుమార్'



మోకా విజయ్ కుమార్..సీనియర్ టెక్నీషియన్. తన బహుముఖ ప్రజ్ఞాపాటవాలతో అనేక కళలకు జీవం పోశారు. ఈయన రూపొందించిన వినూత్న కళాఖండాలకు విశ్వవ్యాప్త గుర్తింపు లభించింది. పనికిరాని వస్తువులతో పలు కళారూపాలు సృష్టించారు. పలు రంగులతో, మిల్లెట్స్‌తో ఈయన తయారు చేసిన 'మూడు రాష్ట్రాలు- మూడు సంస్కృతులు-ఒక డివిజన్' కళాఖండానికి మూడు అవార్డులు వరించాయి. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్స్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నారు.




ప్రకృతి కవి 'జగన్నాథ్'



కేఆర్ జగన్నాథ్.. ఈయన కూడా వాల్తేర్ డివిజన్‌లో స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. ప్రయాణాలు, ప్రకృతి, సంస్కృతి, సామాజిక విషయాలపై కవితలు రాసి ప్రకృతి కవిగా పేరుగాంచారు. తెలుగు సాహిత్యానికి చేస్తున్న కృషికి ప్రపంచ రచయితల ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీల నుంచి 'తెలుగు కీర్తి' జాతీయ టాలెంట్ అవార్డును సొంతం చేసుకోనున్నారు. ఈ అవార్డును శ్రీ కొతు పూర్ణానంద్ విలాస్ వేదిక, విజయవాడలో ఈ ఏడాది ఏప్రిల్ 21న అందుకోనున్నారు.



ప్రేమసాగరం



ఆకాశానికి నక్షత్రాలు,
కెరటానికి తీరం,
చెట్ల ఆకులకు చిరుగాలులు,
ప్రతి మనసుకి ఒక స్నేహం, ప్రేమ
ఉంటేనే అందం..ఆనందం
స్నేహ సాగర తీరంలో ఆ అందాన్ని,
ఆనందాన్ని, అనుభూతిని
అస్వాదిస్తున్నారీ జంట..
అడుగులో అడుగులు వేస్తూ..
ప్రేమసాగరంలో మునిగితేలుతున్నారు.
వుడాపార్క్ బీచ్‌లో విహరిస్తున్న దృశ్యమిది.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బెల్ట్ షాపులతో శాంతిభద్రతలకు విఘాతం

సీతంపేట : రాష్ట్రంలో ఇరవై వేలకుపైగా బెల్ట్ షాపులు విస్తరించాయని, దీంతో గ్రామాల్లో, పట్టణాల్లో లా అండ్ ఆర్డర్ సమస్య బాగా పెరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. లలితానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 15 శాతం మించి మద్యం వాడకం దారులున్నారని గ్రహించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వారి ఓట్ల కోసం నిబంధనను అతిక్రమించి మద్యం ప్రియులను ప్రభావితం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే రూ. 5 లక్షలు జరిమానా విధిస్తామని, రెండో సారి దొరికితే లైసెన్స్ రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు ఎన్ని షాపులు రద్దు లైసెన్సులు రద్దు చేశారో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలనుపీడిస్తూ మద్యం పేరుతో సంపద సృష్టించుకుంటున్న కూటమి నేతలను ఏమీ చెయ్యలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

పోటీ పరీక్ష రాసేందుకు వెళుతూ..

- బస్సు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని దుర్మరణం
- రాజమహేంద్రవరంలో సంఘటన
- మర్రిపాలెంలో విషాదం



కల్యాణి (ఫైల్)

మర్రిపాలెం: రాజమహేంద్రవరం శివారు గామన్ వంతెనపై బుధవారం అర్ధరాత్రి కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు బోల్తాపడిన ఘటనలో నగరంలోని 53వ వార్డు మర్రిపాలెం పార్వతీనగర్‌కు చెందిన హోమిని కల్యాణి (21) మృతి చెందింది. దువ్వాడలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న కల్యాణి కాంపిటీటివ్ పరీక్ష రాయడానికి హైదరాబాద్ బయలుదేరింది. బుధవారం రాత్రి ఎన్ఏడీ కొత్తరోడ్డులో బస్సు ఎక్కగా..అర్ధరాత్రి రాజమండ్రి గామన్ వంతెన వద్ద బస్సు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కల్యాణి అక్కడికక్కడే మృతి చెందగా, మరో పది మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతురాలు శరీరం నుజ్జునుజ్జవ్వడం అందరినీ కలచి వేసింది. గురువారం సాయంత్రం కల్యాణి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంది వచ్చిన కుమార్తె ఇలా విగతజీవిగా ఉండడాన్ని తల్లిదండ్రులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. కల్యాణి తండ్రి రాఘవదాస్ రైల్వే ఉద్యోగి కాగా.. తల్లి లక్ష్మి(లత) గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు, కాగా పెద్ద కుమార్తె మేఘన ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత చదువులకు సిద్ధమవుతోంది. కల్యాణి ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. ఈ క్రమంలో కాంపిటేటివ్ పరీక్ష రాసేందుకు వెళుతూ మృతిచెందడంతో పార్వతినగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు

విశాఖ లీగల్ : నిర్లక్ష్యంగా ఆర్టీసీ బస్సు నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎడ్ల గోవిందరావు 2023 ఏప్రిల్ 14వ తేదీ ఉదయం టౌన్ కొత్త రోడ్డు నుంచి వన్‌టౌన్ పోస్ట్ ఆఫీస్ వైపు అతి వేగంతో బస్సును నడిపి ముందు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు నరేష్‌ను ఢీకొట్టాడు. నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ జె.పురుషోత్తమరావు నేరాభియోగాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై పై విధంగా తీర్పునిచ్చారు.

ప్యాకేజీ కాదు.. పరిరక్షణ కావాలి

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణ కావాలి తప్ప, ప్యాకేజీలు శాశ్వత పరిష్కారం కాదని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలోని విశాఖ ఉక్కు రిలే దీక్షా శిబిరంలో పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ సక్రమంగా దుబారా లేకుండా వినియోగిస్తే కొంత వరకు ఉపశమనం దొరుకుతుంది తప్ప, శాశ్వత పరిష్కారం కాదన్నారు. అమరావతిలో జరుగుతున్న నిర్మాణాలకు విశాఖ ఉక్కును మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, దాసరి సురేష్‌బాబు, డేవిడ్, దొమ్మేటి అప్పారావు, కారు రమణ, దాసరి శ్రీనివాస్, మూర్తి పాల్గొన్నారు.



ఉక్కు దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

డీసీఐకి ఊపిరి!

ఓవైపు కన్సార్టియం పోర్టుల నుంచి విమర్శలు, మరోవైపు సొంత సంస్థలోనే వెన్నుపోటుదారులు.. ఇంకోవైపు వెంటాడుతున్న నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ)కి కేంద్రం ఊపిరి అందించింది. పదేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపించగా ఎట్టకేలకు డీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించేలా అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.1,890 కోట్లతో హార్బర్ నిర్మాణం జరగనుండగా తొలి విడతలో రూ.730 కోట్లు డీసీఐకి అందించనుంది. ఇదైనా సక్రమంగా నిర్వహిస్తే డీసీఐ మళ్లీ లాభాల బాట పట్టేందుకు అవకాశం ఉంది.



డ్రెడ్జింగ్ హార్బర్ నమూనా

- అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ హార్బర్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- డీసీఐ ఆధ్వర్యంలో రూ.1,890 కోట్లతో హార్బర్ నిర్మాణం
- తొలి విడతలో రూ.730 కోట్లు అందజేయనున్న కేంద్రం
- మూడు సముద్రాల్లో డ్రెడ్జింగ్ కార్యకలాపాలు ఇక్కడి నుంచే..

సాక్షి, విశాఖపట్నం : రోజురోజుకీ దిగజారిపోతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పనితీరును నాలుగు కన్సార్టియం పోర్టులు విమర్శిస్తున్నాయి. కొంతమంది అధికారులు, సిబ్బంది కలిసి డీసీఐని ప్రైవేట్‌కు విక్రయించేందుకు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపణలూ వినిపిస్తున్నాయి. దీనికి తోడుగా గత రెండు త్రైమాసికాల్లో డీసీఐని నష్టాలు వెంటాడుతుండటంతో సంస్థ ఉనికి ప్రమాదంలో పడింది. ఓవైపు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు విశాఖ పోర్టు రూ.400 కోట్లు వరకూ సాయం చేసి గాడిలో పెట్టింది. అయినా కొందరు అధికారుల దుర్బుద్ధితో సంస్థ పనితీరు రోజురోజుకీ క్షీణిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం డీసీఐకి ఊపిరినిచ్చింది. డీసీఐ ఆధ్వర్యంలో డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. కోనసీమ జిల్లా అంతర్వేదిలో హార్బర్ నిర్మించేందుకు అంగీకారం తెలుపుతూ నిధులు విడుదలకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

దేశంలోనే తొలి హార్బర్ ఇక్కడే..

ప్రపంచ వ్యాప్తంగా డ్రెడ్జింగ్ టెక్నాలజీ వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో నైపుణ్యాభివృద్ధిని సులభతరం చేసేందుకు డ్రెడ్జింగ్ కేడర్‌కు శిక్షణ కోసం ప్రత్యేకమైన డ్రెడ్జ్ శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలని డీసీఐ 2015లో ప్రణాళికలు సిద్ధం చేసింది. దీంతో పాటు దేశంలో డ్రెడ్జర్లను మరమ్మతు చేయడానికి యార్డుల కొరతను దృష్టిలో ఉంచుకుని, పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలతో కూడిన ప్రత్యేకమైన డ్రెడ్జ్ మరమ్మతుల యార్డు ఉండేలా డ్రెడ్జింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అప్పటి నుంచి కేంద్రం ఈ ప్రాజెక్టును తాత్సారం చేస్తూ వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పదే పదే ప్రతిపాదనలు పంపించిన నేపథ్యంలో మరోసారి పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఎట్టకేలకు అంగీకారం తెలిపింది. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా 175 ఎకరాల్లో రూ.1,890 కోట్లతో డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మించనున్నారు. తొలి విడతలో రూ.730 కోట్లను డీసీఐకి అందజేయనుంది. రెండో విడతలో రూ.640 కోట్లు, మూడో విడతలో రూ.520 కోట్లను కేటాయించనుంది. ప్రపంచంలో మూడు డ్రెడ్జింగ్ హార్బర్లు ఉండగా.. దేశంలోనే తొలి హార్బర్ ఏపీలో ఏర్పాటు కానుంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంతో పాటు హిందూ మహా సముద్రంలో డ్రెడ్జింగ్ కార్యకలాపాలు ఇక్కడి నుంచే జరగనున్నాయి.


తొలుత కళింగపట్నం పరిశీలన

డీసీఐ సీఎండీగా రాజేష్ త్రిపాఠీ పనిచేస్తున్న సమయంలో కేంద్రానికి ఈ ప్రతిపాదన పంపించారు. దీనిపై కోస్టల్ ఇండియా డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ డా.జీవీఆర్ శాస్త్రి అధ్యయనం చేశారు. ఏపీలో రెండు ప్రదేశాలను పరిశీలించారు. తొలుత శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో డ్రెడ్జింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని భావించారు. భూ సర్వే, సాయిల్ టెస్టింగ్ నిర్వహించారు. అనంతరం అంతర్వేదిలో సర్వేలు చేసిన తర్వాత కళింగపట్నం ప్రతిపాదనను విరమించుకున్నారు. అధ్యయనం కోసం డీసీఐ దాదాపు రూ.10 కోట్ల వరకూ ఖర్చు చేసింది. ఈ హార్బర్ ఏర్పాటు సక్రమంగా పూర్తయితే.. డీసీఐ ఆర్థికంగా బలోపేతం అవుతుంది. డీసీఐలో కొందరు అధికారులు మాత్రం.. సంస్థ ఎదుగుదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి మాత్రం కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం మింగుడుపడటం లేదనే విమర్శలొస్తున్నాయి. ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది మాత్రం.. హార్బర్ వస్తే మంచి రోజులు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.



వీరు ఖాకీలు. రూల్స్ అమలు చేస్తారు...కాని పాటించరు. దీనికి నిదర్శనమే ఈ ఫొటో. ఆర్అండ్‌బీ జాతీయ రహదారిలో ఓ ట్రాఫిక్ పోలీసు హెల్మెట్ పెట్టుకుని వాహనం నడుపుతుంటే.. వెనుక కూర్చున్న మరో పోలీసు హెల్మెట్ ఉన్నా ధరించకుండా చేతితో పట్టుకుని వెళ్లిన దృశ్యం 'సాక్షి' కంటపడింది. వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్న నిబంధన ఉంది. దీనిని సదరు ట్రాఫిక్ పోలీసు పట్టించుకోలేదు. సాధారణ వాహనదారుడు ఇలా వారి కంటి పడితే.. చీవాట్లు.. చలానాలు వేస్తారు. ముక్కుపిండి మరీ ఫైన్లు వసూలు చేస్తారు.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పాడేరు ప్రాంతంలో సూర్యుడు ఉదయించే వేళ.. అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. కొండల మధ్య అరుణ వర్ణంలో కాంతులు కనువిందు చేశాయి. గురువారం ఉదయం మంచు ప్రభావం లేకపోవడంతో ఈ అందాలను ప్రకృతి ప్రేమికులు తనివితీరా వీక్షించారు. ఉదయం 7 గంటలకే సూర్యోదయం అయింది. – సాక్షి, పాడేరు

ఇద్దరు బాలురు అదృశ్యం


ఎంవీపీకాలనీ: ఇద్దరు బాలురు అదృశ్యం అయిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిపాలెం క్రాంతినగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు చాట్ల ధీరజ్ ఓ ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ధీరజ్ స్నేహితుడి పుట్టినరోజు వేడుక ఉందంటూ బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో పాటు చైతన్యనగర్‌కు చెందిన 14 ఏళ్ల దత్తి యశ్వంత్ కూడా ఆదే రోజు సాయంత్రం ట్యూషన్‌కు అని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు బాధిత కుటుంబాలు వేర్వేరుగా ఫిర్యాదు చేశాయి. అయితే ఈ ఇద్దరు బాలురు ఒకే స్కూల్‌కు చెందిన వారు కావడంతో ఇద్దరు కలిసే వెళ్లిపోయి ఉంటారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. వీరిలో ఓ బాలుడి వద్ద సెల్‌ఫోన్ ఉండటంతో దాని సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

హోంగార్డుకు గాయాలు

అగనంపూడి: కూర్మన్నపాలెం రాజీవ్ నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న హోంగార్డు లక్ష్మీనాయుడును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. మద్యం సేవించి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో ఈ ఘటన జరిగింది. గాయపడ్డ హోంగార్డును స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్చారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారులకు మేలైన సేవలు

తాటిచెట్లపాలెం: ఖాతాదారులకు మేలైన సేవలందించడమే తమ ధ్యేయమని పద్మపూజిత ఆటో ఫైనాన్స్, వీల్స్ మార్ట్ చైర్మన్ ఆర్ఎస్‌వీపీ బసవరాజు తెలిపారు. దసరా-క్రిస్మస్-సంక్రాంతి సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించగా..గురువారం రైల్వేన్యూకాలనీలోని కార్యాలయంలో విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 27వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకు తమ అన్ని షోరూంలలో బంపర్ డ్రా నిర్వహించామన్నారు. సంస్థ స్థాపించి 22 ఏళ్ల నుంచి ఏటా దసరా సందర్భంగా వివిధ పోటీల ద్వారా వినియోగదారులకు బహుమతులను అందజేస్తున్నామన్నారు. రానున్న మూడునాలుగేళ్లలో ఏపీ, తెలంగాణలో ప్రతి చోటా తమ షోరూంలను విస్తరించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా తమ వద్ద వాహనాలు కొనుగోలు చేసిన కస్టమర్స్‌కు కోసం సర్వీస్ సెంటర్‌లను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. గురువారం వైజాగ్, గాజువాకలకు చెందిన నాలుగు క్లస్టర్ల విజేతలను ప్రకటించారు. వీరిలో ఎస్.గణేష్, ధనాల కిరణ్‌కు ల్యాప్‌టాప్‌లు, ఎస్‌కే హుసేన్, ఎ.మణి, కె. ఈశ్వర్రావు, ఎ.సతీష్‌లు ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ పార్టనర్స్ సీహెచ్ సాయిబాబు, ఎ శ్రీనివాస్, సిబ్బంది ఎ.కిరణ్, రహీం పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటిస్తున్న పద్మపూజిత సంస్థ చైర్మన్ బసవరాజు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మహారాణిపేట : మండల స్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈవో) పి.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పరిపాలన అధికారులకు ఈ ఆఫీస్ నిర్వహణ, కార్యాలయ రికార్డులు, నిధుల వినియోగం, సాంకేతిక అంశాలపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ వివిధ పద్దుల కింద ఉన్న నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తిగా ఖర్చు చేయాలన్నారు. మండల ప్రజా పరిషత్ రికార్డుల నిర్వహణ, వాటి ప్రాముఖ్యతపై సంబంధిత ఎంపీడీవోలు దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ అధికారి శ్వేత పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జీఎస్టీపై అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఉమ్మడి విశాఖ జిల్లాల ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి